# జననీ — జన్మభూమి

— కోనేరు రాజబాబు




మన దేశం నుంచి యిక్కడికి ఎంతో మంది మేధావులు తరలి వచ్చారు. స్వదేశంలో సరైన అవకాశాలు రాక వాళ్ళ తెలివితేటలకు సరైన గుర్తింపు లేకనే వాళ్ళంతా యిక్కడికి వచ్చారమ్మా.

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన టెట్రాసైక్లిన్ కనుగొన్నది మన తెలుగు బిడ్డ ఎల్లాప్రగడ సుబ్బారావమ్మా ఆలాంటి భరత మాత ముద్దు బిడ్డలు యిక్కడ ఎంతో మంది వున్నారు. ఎంత డబ్బు సంపాదించినా స్వదేశాన్ని వదిలి వచ్చామన్న అసంతృప్తి మాలో వుంది.

స్వాతంత్ర్యం రాకముందు మనసంపదను బ్రిటిషవారు దోచుకుపోయారని మన రాజకీయనాయకులు వేదికల మీద నిత్యం ఊకదంపుడు ఉపన్యాసాలిస్తుంటారు. ఎంతోమంది త్యాగమూర్తులు తమ సర్వస్వం ఒడ్డి సాధించిన స్వాతంత్ర్యానంతరం వీళ్ళు చేసిందేమిటి? దానికన్నా విలువైన మన మేధాసంపదను స్వార్థం కోసం, స్వప్రయోజనాలకోసం విదేశాలకు తరలిస్తున్నారు.

ఏ రాజకీయ పార్టీగాని ఓట్లు సంపాదించే చిట్కాలు ఉపయోగిస్తున్నదే గాని మనమేధావుల గురించి, వాళ్ళను స్వదేశంలో నిలిపే అవసరం గురించీ వాళ్ళకు సరైన అవకాశాలు కల్పించే విషయం గురించే పట్టించుకోవటం లేదు. ఇలాగే పరిస్థితులు కొనసాగితే దేశం నిర్వీర్య మౌతుంది. అందుకే నిజమైన స్వాతంత్ర్యయోధుని తనయుడిగా ఒక నిర్ణయానికి వచ్చాను. నేను కొన్నివందల కోట్లు సంపాదించాను.

తన జీవితకాలంలో నాన్న ఏనాడూ సుఖపడి ఎరుగడు. ఇప్పుడు ఆ అవకాశం ఉన్నా, నువ్వు శిధిలమైపోతూ యింటిని వదిలేందుకుగాని సుఖపడేందుకుగాని యిష్టపడవు.

ఎంత డబ్బు సంపాదించినా నా భార్యా నా బిడ్డా తిరిగిరారు.

నా దగ్గరున్న డబ్బుతో భారతదేశంలో ఒక ప్రొఫెషనల్ కాలేజీని స్థాపించాలను కొన్నాను. కులానికీ, మతానికీ అతీతంగా కేవలం మెరిట్ వచ్చిన విద్యార్థులే అవకాశం కల్పించాలను కొన్నాను.

భారతదేశం సెక్యులర్ స్టేట్ అన్న వాస్తవాన్ని క్రియారూపంలో చూపాలనుకొన్నాను.

కానీ... కానీ...

ప్రస్తుత భారత చట్టప్రకారం ప్రైవేటు కాలేజీలకు అనుమతినిచ్చే అవకాశం లేదంటూ భారతప్రధాని నా విన్నపాన్ని త్రోసిపుచ్చారు.

మిగిలిందల్లా ఒకే ఆశ — ఆశయం.

నాలాంటి డాక్టరు వద్ద చికిత్స పొందాలంటే సామాన్య మానవుడికి సాధ్యమయ్యేపనికాదు.

నా భార్య 'హార్ట్ ఎటాక్' తో చనిపోయింది.

ఆమె జ్ఞాపకార్థము మనదేశంలో ఒక అధునాతనమైన హాస్పిటల్ నెలకొల్పుతాను. ఉచిత వైద్య సౌకర్యాన్ని కలుగజేస్తాను.

నాదేశ ప్రజలకు ఆ మాత్రమైనా సేవచేస్తాను.

అమెరికాలో న్యూజెర్సీ మహానగరంలో ఒక అధునాతనమైన భవంతిలో నివసించే డాక్టర్ రావు తన పూజా మందిరంలో వేంచేసి వున్న స్వామివారికి, షిర్డీ సాయిబాబా వారికి సుప్రభాతము, ప్రార్థనలుగావించి, బయటకు వచ్చి టీపాయ్‌మీద వున్న టేప్ రికార్డరు ఆన్ చేశాడు.

"పుణ్యభూమి నా దేశం నమో నమామి
కన్నతల్లి నా దేశం సదా స్మరామి"
అంటూ పాట మొదలైంది.

ఈ పాటను రావు కొన్ని వందల సార్లు విన్నాడు. అయినా తృప్తి తీరక మళ్ళీ మళ్ళీ వింటూనే వుంటాడు. భారతదేశం వదిలి పాతిక సంవత్సరాలు దాటినా మాతృదేశం మీద అతనికున్న మమకారం కాని, భారతీయ సంస్కృతిపట్ల అతనికున్న గౌరవం కాని నీసమెత్తు కూడా తరగలేదు.

అమెరికాలో డాక్టర్ రావు యిప్పుడు నంబర్ వన్ సర్జను. అమెరికాలో ఎక్కడ ఎలాంటి కాంప్లికేటెడ్ హార్ట్‌సర్జరీ జరిగినా అతనక్కడ వుండవలసిందే! అతని సలహా, సంప్రదింపులు లేనిదే ఏ డాక్టరూ రోగి వొంటిమీద కత్తి మోపేందుకు సాహసించడనే చెప్పాలి.

తన వృత్తిలో రావు ఎన్నో విజయాలను సాధిస్తుంటాడు. అతను సాధించే విజయాల గూర్చి రోజూ పత్రికల్లో వార్తలు వస్తూనే వుంటాయ్.

నిత్యం అతనిని అభినందిస్తూ ప్రపంచం నలుమూలల నుంచీ ఎన్నో ఉత్తరాలు, సందేశాలు వస్తుంటాయి.

ఆ రోజు కూడా కుప్ప తెప్పలుగా ఉత్తరాలు వచ్చాయి.

వాటిని పరికిస్తున్న రావు దృష్టిని ఒక ఉత్తరం ఆకర్షించింది.

దానిని చూడగానే రావు కనులు ఆనందంతో మెరిశాయి.

అది తన మాతృదేశం నుంచి వచ్చిన ఉత్తరం.

పైగా తనకు జన్మనిచ్చిన జనని వ్రాసిన ఉత్తరం.

మనసారా దాన్ని ఒక్కసారి హృదయానికి హత్తుకొని చదవనారంభించాడు రావు.

"ప్రియమైన చిరంజీవిని చిరాయువుగా దీవించి మీ అమ్మ సుభద్రమ్మ వ్రాయు సంగతులు.

ఎలా వున్నావు బాబూ? రోజూ నీ గురించి ఏదో ఒక వార్త పేపర్లో చదివి ఆనందించటమేకాని నిన్ను కనులారా చూసుకోవాలన్న కోర్కె మాత్రం తీరడంలేదు కన్నా!

ఒక్కసారి రమ్మంటే తీరిక లేదంటావు.

లేదా నన్నక్కడికి రమ్మంటావు. నీకు బాగా తెలుసు మీ నాన్నగారు భారతావనికి స్వాతంత్ర్యాన్ని సాధించే మహాయజ్ఞంలో సమిధైపోయారని. నన్ను ఎండిన మోడులా బ్రతకమని వొంటరిదాన్ని చేసి వెళ్ళి పోయారు. నువ్వుకూడా నన్ను వదిలి కొన్ని వేల కిలోమీటర్ల దూరానికి వెళ్ళిపోయావు.

మీ నాన్నగారు, నేను కలసి రాత్రింబవళ్ళు శ్రమించి కట్టుకున్న ఈ యింటికి పేర్చిన ప్రతి రాయి ఒక కథ చెబుతుంది బాబూ – ఆ మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ నేనింకా బ్రతుకుతున్నాను. ఎప్పుడు నాకు భగవంతుడు అనుగ్రహిస్తాడో, నా స్వామి దగ్గరకు నన్నెప్పుడు తీసుకెడతాడో తెలియకుండా వుంది. వయసొచ్చిన నన్ను మరచిపోయి భగవంతుడు నీ భార్యను నీకు దూరం చేశాడు. నిర్దయతో నీ కొడుకును కూడా నీకు దూరం చేశాడు.

నన్ను మాత్రం నీటన్నిటినీ చూసి ఏడ్వమని శాపం పెట్టాడు.

వాళ్ళంతా తిరిగి చేరుకోలేని దూరానికి వెళ్ళిపోయినా రోజూ ఈ యింట్లో తిరుగాడినట్లే వుంటుంది. అలాంటి యింటిని వదిలి నేను ఎలా రాగలను కన్నా? ప్రతి తల్లీ అవసాన దశలో తన బిడ్డల చెంత తుది శ్వాస విడవాలనుకొంటుంది. వాళ్ళ చేతుల మీదుగా దాటిపోవాలనుకొంటుంది. అంతకన్నా ఈ జన్మలో ఈ ముసలి తల్లి నిన్ను కోరుకొనే దేముంటుంది బాబూ.

కన్నా! నాకడసారి కోర్కెను తీరుస్తావు కదూ!

ప్రేమతో

మీ అమ్మ సుభద్రమ్మ

రావు కళ్ళు చెమర్చినాయి.

రోజూ హృదయాల మీద ఆడుకొనే రావు హృదయం ఒక్కసారి బిగబట్టినట్టయింది. ఒక్కసారి పాతిక సంవత్సరాల సంఘటనలు అతని మదిలో సినిమా రీలులా తిరిగాయి.

తాను అపురూపంగా, ప్రాణానికి ప్రాణంగా చూసుకునే భార్య ప్రమీల బంధువుల యింట్లో పెళ్ళికని ఒక మారుమూల పల్లెటూరికి వెళ్ళి 'హార్ట్ ఎటాక్'తో చనిపోయింది. అంతటి హార్ట్ స్పెషలిస్టు రావు కూడా తన భార్య విషయంలో విధికి తలవంచక తప్పలేదు. కన్నీటితో ఆమెను కాటికి సాగనంపి అచేతనంగా జీవితాన్ని గడపనారంభించాడు రావు. ఎంతో మంది వయసులో ఉన్న రావును మరో పెళ్ళి చేసుకోమని బలవంతపెట్టారు.

రావు దానికిససేమిరా ఒప్పుకోలేదు.

తన భార్య ప్రమీల స్థానాన్ని మరొకరికివ్వలేనన్నాడు.

అందుకే ఆమె తన ప్రేమ కానుకగా మిగిల్చిన 5 ఏళ్ళ బాబు అభిలాష్‌ను ఆప్యాయంగా పెంచి పెద్దవాడిని చేశాడు.

అభిలాష్ కూడా బుద్ధిగా చదివి కాలేజీ చదువు పూర్తిచేసి 'ఎంసెట్' వ్రాశాడు.

కానీ విధి బలీయమైనది. మామూలుగా అయితే అతనికి సీటు రావలసిందే. కానీ

అతనికి సీటు కొద్దిలో తప్పిపోయింది

అభిలాష్‌కు తండ్రికి మొఖం చూపేందుకు ధైర్యం చాలలేదు. అందుకే ఆత్మహత్య చేసుకున్నాడు. కలలో కూడా ఊహించని ఈ సంఘటన రావును మరింత కృంగదీసింది.

ఇంతకాలం తన ప్రమీల రూపాన్ని అభిలాష్‌లో చూసుకుని బ్రతుకుతున్నాడు రావు. ఇప్పుడా అవకాశం కూడా కనుమరుగై పోయింది.

కష్టాలన్నీ కట్టగట్టుకొని ఒకేసారి వస్తాయన్నట్టుగా డాక్టరు రావు సీనియారిటీని, సిన్సియారిటీని కూడా లెక్క చేయకుండా ప్రభుత్వమువారు రావు దగ్గర చదువుకొని ఎం.బి.బి.ఎస్‌పాసైన అతనికి హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ యిచ్చారు. దీనిని రావు జీర్ణించుకోలేక పోయాడు.

రావు అభిమానం దెబ్బతిన్నది.

రాత్రింబవళ్ళు ఆలోచించాడు. ఆఖరికి ఒక నిర్ణయానికి వచ్చి ఆ రోజే తన పదవికి రాజీనామా సమర్పించి, వీసా సంపాదించి అమెరికా వచ్చాడు.

అప్పుడే పాతిక సంవత్సరాలు నిండిపోయాయి.

ఇప్పుడు రావు నంబర్‌వన్ డాక్టర్ అమెరికాలో –

కొన్ని వందల కోట్లు సంపాదించాడు. అంతకు మించి పేరు ప్రతిష్ఠలు గడించాడు. పాత జ్ఞాపకాల నుండి ఒక్కసారి తేరుకుని లెటర్ ప్యాడ్ తీసి తల్లికి ఉత్తరం వ్రాయడం మొదలుపెట్టాడు రావు.

"పూజ్యురాలైన మాతృమూర్తి పాదపద్మములకు నమస్కరించి నీ తనయుడు డాక్టరు రావు వ్రాయు విన్నపములు –

అమ్మా! నీ ఉత్తరము ఈ రోజే చదివాను.

మాతృమూర్తిని వొంటరిగా వదిలి వచ్చిన నిర్దయుడనైనా, నీ బాధను అర్థం చేసుకోలేనంత మూర్ఖుడు కాదమ్మా నీ కొడుకు.

నేను అపురూపంగా చూసుకునే నా ప్రమీల నాకు దూరమైంది.

అల్లారు ముద్దుగా పెంచుకొన్న నా కొడుకు నాకు అన్యాయం చేశాడు. మంచి మార్కులు తెచ్చుకొన్నా సీటురాక నా కొడుకు, సీనియారిటీ వున్నా ప్రమోషను రాక నేను...

నాన్నగారి నుంచి నేను పుణికి పుచ్చుకున్నది అభిమాన మొక్కటేనమ్మా– దాన్ని చంపుకొని బ్రతకలేకనే నేనిక్కడికి వచ్చాను.

అంతేకాని నా జననిని – జన్మభూమిని ధ్యానం చెయ్యనిదే నేనే రోజూ ఈ పాతిక సంవత్సరాలలో అన్నం ముట్టలేదమ్మా.

*ప్రముఖ తత్త్వవేత్త ఎంపిడో క్లెస్‌ను ఓ యువకుడు కలుసుకుని

"నేను అనేకమంది తెలివైనవారినీ, ప్రతిభావంతుల్నీ కలుసుకుని మాట్లాడాను. అందువలన నేను చాలా తెలివైనవాణ్ణి అయ్యాను" అంటూ గొప్పలు చెప్పుకున్నాడు.

అందుకు ఎంపిడోక్లెస్ చిరునవ్వుతో "నేను అనేకమంది శ్రీమంతులతో మాట్లాడాను. ఐనప్పటికిని ధనవంతుణ్ణి కాలేకపోయాను" అని చెప్పాడు.

– పట్నం శేషంశెట్టి

దీన్ని ఏ చట్టమూ అడ్డుకోదు కదమ్మా.

ఇకపోతే నాకన్నా ముందుగా నువ్వు చనిపోతే నువ్వు కోరిన కోరిక తీరుతంది. లేకపోతే నాచేతుల మీదుగా పంపే అదృష్టము నాకీ జన్మకు దక్కదు. నేను చనిపోయిన తరువాత నా భౌతికకాయాన్ని నా జనని వద్దకు చేర్చమని, నా పుణ్యభూమిలో, నాజన్మ భూమిలో, నా భారతావనిలో విలీనం చెయ్యమని విల్లు వ్రాశాను. ఉంటానమ్మా.

నీ పుత్రుడు

డాక్టరురావు.

ఉత్తరం వ్రాయటం ముగించి పోస్టు చేసేందుకు కోటుజేబులో పెట్టుకున్నాడురావ్.

టేబిల్ మీద ఉన్న ఫోను మ్రోగింది.

"హలో ! రావ్ స్పీకింగ్"

"గుడ్ మోర్నింగ్ రావ్! నేను డాక్టర్ ఎడ్వర్డును. మా హాస్పిటల్‌లో ఇప్పుడు ఒక ఎమర్జన్సీ హార్టుసర్జరీ ఉంది. అంతా సిద్ధంగా ఉంది. నువ్వు వెంటనే బయలు దేరిరా. ఇది నా ప్రత్యేక అభ్యర్థన"

"యస్. కమింగ్" అంటూ ఫోను పెట్టేసి బయలుదేరాడు రావ్. 10 నిమిషాలలో ఆపరేషను థియేటరుకు చేరుకున్నాడురావ్.

* * *

డాక్టరు ఎడ్వర్డు ఆనందంతో రావుఉన్న రూంలోకి ప్రవేశించాడు. "కంగ్రాచులేషన్స్ రావ్! మా హాస్పటల్ పరువునే కాక అమెరికా ప్రభుత్వ ప్రతిష్టనే కాపాడావు. నీకు మేమెంతో ఋణపడి ఉన్నాము. అమెరికా ప్రెసిడెంట్ నీకు ధన్యవాదాలు తెలిపేందుకు ఫోనులో వెయిట్ చేస్తున్నారు. రా రావ్!" అంటూ చెయ్యి పట్టుకున్నాడు ఎడ్వర్డు.

చెయ్యి ఐసుగడ్డలా జారిపోయింది.

అప్పటికే డాక్టరురావు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

"రావ్! ఎంత ఘోరం జరిగిపోయింది రావ్! మా పరువు ప్రతిష్టలను నిలబెట్టి నువ్వు మాత్రం మాకు దూరంగా వెళ్ళిపోయావా రావ్! ఇప్పుడు నువ్వు ఆపరేషను చేసింది ఎవరికో తెలుసా?

సాక్షాత్తు మీ భారతప్రధానికి. ఈ విషయం నీకు చెప్పి నిన్ను ఆశ్చర్యంలో ముంచెత్తాలను కొన్నాను. కానీ నువ్వే మమ్మల్నందరినీ ఆశ్చర్యపరచి విషాదంలో ముంచేశావ్" అంటూ బోరున ఏడ్వడం మొదలుపెట్టాడు.

పుత్రుని మరణవార్తవిన్న సుభద్రమ్మ "నీ ఆయువు కూడా నాకే యిచ్చి నన్ను నిందు నూరేళ్ళు ఏడుస్తూ బ్రతకమని నన్ను దిక్కులేనిదాన్ని చేసి వెళ్ళిపోయావా బాబూ. ఒక్కసారి నిన్ను చూడాలని ఉందన్న కోరికను వ్రాసినందుకు ఈ రకంగా ఆఖరిసారిగా నీముఖం చూపేందుకు వస్తున్నావా కన్నా" అంటూ రోదిస్తుంటే ఆ తల్లిని ఓదార్చేందుకు ఎవ్వరికీ ధైర్యం చాలలేదు.

అమెరికా నలుమూలల నుంచి వేలాది మంది డాక్టర్లు వచ్చి తమ ప్రియతమ డాక్టరు రావుకు కడసారిగా శ్రద్ధాంజలి ఘటించి కన్నీటితో వీడ్కోలు చెబుతుండగా అమెరికా ప్రభుత్వము వారి ప్రత్యేక విమానంలో రావు భౌతికకాయం పుణ్యభూమిలో విలీనమయ్యేందుకు గగనతలానికి తరలిపోయింది.

నాలుగురోజుల తరువాత భారత ప్రధాని కోలుకున్న తరువాత డాక్టరు ఎడ్వర్డ్ రావు తన తల్లికి చివరిసారిగా వ్రాసిన ఉత్తరాన్ని భారత ప్రధాని ముందుంచాడు.

తన ప్రాణదాత చివరిసారిగా తల్లికి వ్రాసిన ఉత్తరాన్ని చదివి మెదడు మొద్దుబారి రెండుకన్నీటి బిందువులను ఆ ఉత్తరం మీద విడిచాడు భారత ప్రధాని.

## దూరదర్శనమా

*క్రికెటు బ్యాటు గురించి కీచులాడెడి కుర్ర*
*కుంకల బుద్ధికి కుదురు కలిగె*
*పేకాటలకు పోవు పెద్దన్న ఇంటిలో*
*ఆదివారము నాడు అణగియుండె*
*సినిమాల సరదాల కని రోడ్ల తిరిగెడు*
*పడుచు జంటలు ఇల్లు వదలి పోరు*
*అత్తలు కోడళ్ళు అన్యోన్యముగ నొక*
*చోట కూర్చుని చూడ చోద్యమగును*

*దూర దర్శనమా పెద్ద దొరవు నీవు*
*తీవిగా ఇంటనిల్చితి 'టీవి'గాను*
*మా గృహంబుల నీకెంతొ మహిమ గలదు*
*ఇంటి జగడాల కవకాశ మీయకుండ.*


\- మేడిచర్ల వేంకటరామశేషు
Vijayawada, AP

వెనక సీట్లోనివారు అదే పనిగా మాట్లాడుతూంటే, సోమసుందరానికి చిరాకుగా వుంది. తెర మీద పిక్చర్ కంటె చెవిలో రొద. అంతకీ ఒక అరగంట వోపిక పట్టి :

'సార్, ఒక్క మాట వినపడటం లేదు.'

'ఏం పెద్దమనిషివయ్యా, భార్యాభర్తలం మేము మాటాడుకొనే మాటలు నీకు వినిపించాలా ?' - అని వెనక సీట్లోని పెద్దమనిషి విరుచుకు పడేసరికి, సోమసుందరం నిర్ఘాంతపోయాడు.

—యస్ జానకి
న్యూఢిల్లీ




## సుబ్బారావు కి సన్మానమ్

గవరసాన సత్యనారాయణ
నార్‌వుడ్, మెసాచుసెట్సు

కోనసీమలో పడిన కొబ్బరి కాయ
బంగాళాఖాత తీరంలో ఉక్కునగరాన చేరి
మేధావులతో నిండిన కాందిశీకుల ద్వీపంలో తేలి
ఛార్లెస్ నదీ తీర నగరంలో మొలిచింది.

నూతన వైద్య సిద్ధాంత ప్రతిపాదనకు
ఆర్యసాంప్రదాయానికి ఆధునిక శాస్త్రరీతుల మేళవింపుకు
తూర్పు పడమరల కలయిక ప్రతినిధికి
అమెరికన్ యూరాలజీ సంఘం ప్రకటించింది అవార్డు.

కోనసీమలో చక్కటి లంక బెండమూర్లంక
లంకలో మేటి భూస్వాములు యాళ్ల వంశీయులు
వంశయశస్సుకు కారణభూతుడు సుబ్బారావు
రామరత్నంగోపాలరావుల ముద్దుల సుతుడు.

మూత్రజల గతులను తీర్చిదిద్దిన పరిశోధన
మరసిరి లక్ష్యసాధనకు శాస్త్రీయ పరికరాలు
వైద్యపరిశోధన ఫలితాల వ్యాసావళి
సాధించాడు బహువైద్యగ్రంధాల ప్రచురణ.

స్నేహశీలుడు, శస్త్ర చికిత్సనిపుణుడు, పరిశోధకుడు
గ్రంధకర్త, శిష్యగణమును గడించిన ఆచార్యుడు
జీవితకాల ఫలమును అందుకున్న సుబ్బారావుకి
బంధుమిత్రులు చేశారు ఘనసన్మానం.

(Dr. Subbarao v. Yalla was recently honored by the American Urology Association with its Life-Time Achievement Award.)